సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

అలరించిన సినీ ఆర్కెస్ట్రా



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పిలక రాము, పోలిరెడ్డి

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం యాదవవీధిలో వినాయక ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం ఎం.కె.పి. మ్యూజికల్ ఈవెంట్ ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. కార్యక్రమాన్ని వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పిలక రామ్మోహన్‌రెడ్డి (పిలక రాము),బూస అప్పలరెడ్డి, వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేష్,కాకి పోలిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మల్కాపురం గ్రామానికి చెందిన గాయకులు ఉరుకూటి బాబూరావు,కామేష్,పైడిరాజు నూనెల,కిలాని పైడిరాజు తదితరులు చక్కటి పాటలు పాడి ఆహుతులను అలరించారు.

గిడుగు సేవలు చిరస్మరణీయం



గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ వాసుదేవరావు

మల్కాపురం: వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి తెలుగు భాష అభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయం అని లక్కీ అమర్ పాఠశాల ప్రిన్సిపాల్ వాసుదేవరావు అన్నారు. తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని శనివారం పాఠశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు భాష విశిష్టతను చాటిచెప్పిన మహనీయుడు గిడుగు అని కొనియాడారు. క్విజ్,వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన వారికి తెలుగు ఉపాధ్యాయురాలు కోమలి బహుమతులు అందించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



చెక్కు అందిస్తున్న విప్ గణబాబు

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు పాత కరసా, ఎన్‌ఏడీ జంక్షన్ ప్రాంతాల్లో పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ప్రభుత్వ విప్ గణబాబు శనివారం అందించారు. పాత కరసా వాసి సీహెచ్ రమణారావుకు రూ.95, 470 చెక్కు అందించారు. కార్యక్రమంలో తిరుమలరావు, చంద్రశేఖర్, బలభద్రరాజు పాల్గొన్నారు.

వరసిద్ధి వినాయకుడికి చిన్నారుల దీపారాధన



గొల్ల కంచరపాలెంలో దీపారాధన చేస్తున్న చిన్నారులు, ట్రస్ట్ సభ్యులు

కంచరపాలెం: గొల్ల కంచరపాలెంలో వరసిద్ధి వినాయక ఉత్సవాల్లో భాగంగా రాధికా'స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం దీపారాధన నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు, చిన్నారులు ఏర్పాటు చేసిన వినాయక పందిరిలో ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం అన్నప్రసాద వితరణ, బుధవారం నిమజ్జన కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఓం కారం, గణేషుడి ఆకారంలో సర్వమత సమ్మేళనంతో రంగులు వేసి దీపాలు వెలిగించి చిన్నారులు తమ దైవభక్తిని చాటారు. అనంతరం విద్యార్థులకు అల్పాహారం అందించారు. ట్రస్టు సభ్యులు జ్యోతేష్, జశ్వంత్, మాన్విత, తేజశ్రీ, ప్రధాన లక్ష్మి లావణ్య, నిఖిల, ఈష్మిత, సాద్విక్, నామాల లోహిత్, హర్షవర్ధన్ సాయి, ఎం.జశ్వంత్, జగదీశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ఉంటేనే ఆహార ఉత్పత్తుల ఎగుమతి

గాజువాక: ఆహార ఉత్పత్తుల ఎగుమతులకు ప్రపంచమార్కెట్‌లో నాణ్యత, ఆహారభద్రత పోటీతత్వంగా మారాయని ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వశాఖ కార్యదర్శి ఏపీ దాస్ జోషి అన్నారు. గాజువాక ఆటోనగర్‌లోని బయోఫ్యాక్ట్ రీసెర్చ్ లేబొరేటరీని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందితో మాట్లాడి వివిధ అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలను పరీక్షిస్తున్న విధానాన్ని పరిశీలించారు.

గెడ్డలు ఘోరం



- 58వ వార్డులోని కాలువల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డులోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ అటకెక్కింది. సకాలంలో వ్యర్థాలు తొలగించక పోవడంతో కాలువలు, వీధుల్లో చెత్త పేరుకుపోతుంది. వర్షాలు కురిసే సమయంలో వరద నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారి మురుగు రోడ్లపైకి, ఇళ్లల్లోకి పోటెత్తుతుంది. ప్రధానంగా పిలకవానిపాలెం గెడ్డలో వ్యర్థాలు పేరుకుపోయాయి. పందులు, వీధి కుక్కలు అక్కడకు చేరి గెడ్డలో ఉన్న వ్యర్థాలను బయటకు తీస్తూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. దీంతో గెడ్డకు ఆనుకుని ఉన్న నివాసీయులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఒక వైపు వ్యర్థాలు పేరుకుపోవడం మరో వైపు దుర్వాసనతో నరకం చూస్తున్నారు. అధికారులు స్పందించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. అలాగే ఇదే వార్డు ములగాడ విలేజ్ ప్రాంతంలో వీధి కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి కంపుకొడుతోంది. చెడు వాసన వల్ల నిత్యం తలుపులు వేసుకుని ఉండాల్సిన పరిస్థితి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. ఇదే మాదిరిగా శ్రీహరిపురం పరిసర ప్రాంతాల్లో వీధి కాలువల్లో,గుల్లలపాలెం గెడ్డల్లో వ్యర్థాలు నిలిచిపోయాయి. అధికారులు స్పందించి పూడికలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



పిలకవానిపాలెం గెడ్డలో నిలిచిపోయిన వ్యర్థాలు

స్మార్టు మీటర్లు రద్దయ్యే వరకు పోరాటం

మల్కాపురం: ఆదానీ స్మార్టు విద్యుత్ మీటర్లను రద్దు చేసే వరకు తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని సీపీఎం మల్కాపురం జోన్ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి స్పష్టం చేశారు. స్మార్టు మీటర్లను నిలుపు చేయాలని డిమాండ్ చేస్తూ 58వ వార్డు గుల్లలపాలెంలో, 59వ వార్డు నెహ్రూనగర్‌లో శనివారం సాయంత్రం వేర్వేరుగా నిరసన కార్యక్రమాలను చేపట్టారు. 58వ వార్డు వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మణమూర్తి బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమంలో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి చిత్ర పటాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక ఎన్నడూ లేనివిధంగా విద్యుత్ చార్జీలు పెరిగాయన్నారు. అసలే పెరిగిన చార్జీలతో సతమతమవుతున్న ప్రజలను, ఇప్పుడు స్మార్ట్ మీటర్లు పెట్టి మరింత దోచుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తక్షణం కూటమి ప్రభుత్వం స్మార్టు మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పైడిరాజు, విమల తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న సీపీఎం నాయకులు

నాయీ బ్రాహ్మణుల సమస్యలపై వినతి

గోపాలపట్నం: నాయీ బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విశాఖ జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు శనివారం మంత్రి నారా లోకేష్‌కు వినతి పత్రం అందించారు. విశాఖ జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు నరవ పైడిరాజు తమ సమస్యలను వివరించారు. సెలూన్లలో విద్యుత్ వినియోగం 200 యూనిట్లు దాటిన వారికి డొమస్టిక్ బిల్లుగా పరిగణించాలని కోరారు. అలాగే ధన్వంతరి జయంతిని అక్టోబర్ 22న ప్రభుత్వ కార్యక్రమంగా చేయాలని కోరారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



నరవ కొండవాలు ప్రాంతంలో విత్తన బంతులు చల్లుతున్న విద్యార్థులు

గోపాలపట్నం: విత్తన బంతులు తయారు చేయడం .. వర్షాకాలంలో వాటిని చల్లడం అలవర్చుకోవాలని జేడీ ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ కారుమూరి అరుణ పిలుపునిచ్చారు. నరవలో విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు శనివారం విత్తన బంతులు చల్లే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు మన పర్యావరణాన్ని కాపాడుతాయని తెలిపారు. వాతావరణ సమతుల్యతను కాపాడి సకాలంలో వర్షాలు పడేందుకు దోహదపడతాయన్నారు.వనాలు పెరిగి భూతాపాన్ని తగ్గిస్తాయని వివరించారు. జేడీ ఫౌండేషన్ సభ్యులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

గోపాలపట్నం సీఐ బాధ్యతల స్వీకరణ

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని సన్యాసినాయుడు వెల్లడి

- ఏడాదిలో ముగ్గురు మారిన వైనం
- ఒత్తిళ్లే కారణమని గుసగుసలు
- ఎందుకిలా అని పోలీసు వర్గాలతో పాటు ప్రజల్లో చర్చ

గోపాలపట్నం: గోపాలపట్నం సీఐగా లంకా సన్యాసినాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లాలో చాలా ఏళ్లు పని చేసి తర్వాత విశాఖ సిటీ ట్రెనింగ్ సెంటర్‌లో పని చేశారు. ఇక్కడి నుంచి గోపాలపట్నం బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ విశాఖలో కొన్నాళ్లు పని చేశానని నగర పరిస్థితులపై అవగాహన ఉందని చెబుతున్నారు.శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

ఈ సారైనా కొనసాగేనా...

పీస్‌ఫుల్ పోలీస్ స్టేషన్‌లో ఇపుడు పీసే లేకుండా పోతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. పోలీసుల పరిభాషలో నగరంలోని గోపాలపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఉద్యోగం చేసుకోవచ్చని సీఐలు, ఎస్‌ఐలు భావిస్తుంటారు. కాని ఇప్పుడు ఆ పరిస్థితి లేదని తాజా పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏడాదిలో ముగ్గురు సీఐలు మారడమే నిదర్శనమని గుసగుసలు వినిపిస్తున్నాయి. వీరు మూడు నాలుగు నెలలు మాత్రమే ఉన్నారు. వారికి వారే ట్రాన్స్‌ఫర్లు కోరుకుని వెళ్లిపోయారని ప్రచారం సాగుతోంది. స్థానిక ఎమ్మెల్యే అనుచరుల ఒత్తిడే ఇందుకు కారణమని సిబ్బంది వాపోతున్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం అమలుకు సహకరించలేక.. ఉండలేక సతమతమతున్న నేపథ్యంలో సీఐలే ట్రాన్స్‌ఫర్లు కోరుతున్నారని చెప్పుకుంటున్నారు. స్టేషన్‌కు సీఐలుగా వచ్చిన సురేష్, గొలగాని అప్పారావు, ఇప్పుడు ఎస్‌బీ ప్రభాకర్‌కు బదిలీ అయింది. వీరంతా 4 నెలలు మాత్రమే పనిచేసి గోపాలపట్నం నుంచి తప్పుకున్నారు. దీంతో ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటుందనుకున్న స్టేషన్ ఇబ్బందికర స్టేషన్‌గా మారిపోయిందని ప్రచారం నడుస్తోంది. ఈయన ఇక్కడ ఎన్నాళ్లు పని చేస్తారో చూడాలని ప్రజలు చర్చించుకోవడం గమనార్హం.



సీఐ సన్యాసినాయుడు

పార్వతీ తనయుడికి ప్రత్యేక పూజలు



తిరుమల నగర్ కాలనీ వద్ద దీపాలంకరణలో పాల్గొన్న కాలనీ వాసులు



గుల్లలపాలెం వద్ద గణేశుని పూజల్లో పాల్గొన్న కోరమాండల్ సీఎస్సార్ అధికారి వెంకటరమణ

మల్కాపురం: గణపతి నవరాత్రి మహోత్సవాలు పారిశ్రామిక ప్రాంతంలో కనులపండువగా జరుగుతున్నాయి. నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద దీపారాధనలు నిర్వహించారు. స్థానిక తిరుమలనగర్ కాలనీలో, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దీపాలంకరణ చేపట్టారు. కార్యక్రమంలో కాలనీ వాసులు కుటుంబసభ్యులతో పాల్గొన్నారు.

- 58వ వార్డు శాంతినగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వినాయకుని పూజల్లో కోరమాండల్ సీఎస్ఆర్ విభాగ అధికారి వెంకటరమణ పాల్గొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి రాజరాజేశ్వరి, కోశాధికారి స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు 10,001 దీపాలతో దీపాలంకరణ చేశారు.

గణేశుని సన్నిధిలో అన్న సమారాధన



శ్రీహరిపురం వద్ద అన్న సమారాధనలో పాల్గొన్న కార్పొరేటర్ పీవీ సురేష్



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కమిటీ పెద్దలు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం రెండు గుడుల సెంటర్ వద్ద కాలనీవాసులు ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శనివారం అన్నసమారాధన నిర్వహించారు. కార్పొరేటర్ పీవీ సురేష్, మహిళా నాయకురాలు మళ్ల ధనలత పాల్గొని, అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వై.అశోక్, సీహెచ్ బుజ్జి, సీహెచ్ శ్రీను, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

పోటాపోటీగా అన్నసమారాధనలు

గోపాలపట్నం: వినాయక ఉత్సవాల్లో భాగంగా గోపాలపట్నం, ఎన్‌ఏడీలోని పలు వినాయక మండపాల వద్ద శనివారం అన్నదానాలు పోటాపోటీగా నిర్వహించారు. జీవీఎంసీ 89వ వార్డు సంతోషినగర్ రెండో లైన్‌లో స్టూడెంట్ బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనను పెద్దలు నంబారి కసవయ్య తదితరులు ప్రారంభించారు. జీవీఎంసీ 52వ వార్డు సాకేతపురంలో వరసిద్ధి వినాయక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మౌర్యసింహ

62వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో గణేష్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాల్లో శనివారం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని నాయకులు మౌర్యసింహ, మజ్జి మాలినాయుడు ప్రారంభించారు. వందలాది మంది అన్నప్రసాదాలు స్వీకరించారు.

ఎయిర్‌పోర్టులో కుక్కల హల్‌చల్

బెంబేలెత్తుతున్న ప్రయాణికులు

సాక్షి, విశాఖపట్నం: టికెట్ తీసుకోవు.. బోర్డింగ్ పాస్ అవసరం లేదు.. ఎక్కడికంటే అక్కడికి వెళ్లిపోతున్నాయి.. ఎయిర్‌పోర్టును ఆక్రమించేస్తున్నాయి. వైజాగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శునకాలు స్పెషల్ ఎంట్రీ ఇస్తున్నాయి. ప్రయాణికులు సేదతీరాల్సిన చైర్లపై శయనిస్తున్నాయి. ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో కుక్కలను చూసి.. ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. లాంజ్‌లోకి శునకాలు వచ్చేంత వరకూ ఎయిర్‌పోర్టు అధికారులు ఎలా నిర్లక్ష్యంగా ఉంటున్నారంటూ ప్రయాణికులు ఫిర్యాదులు చేస్తున్నారు. గతేడాది కాలంగా విశాఖ విమానాశ్రయంలో పరిశుభ్ర వాతావరణం లోపిస్తోందంటూ ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ఎయిర్‌పోర్టు పరిశుభ్రతపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



ప్రయాణికుల లాంజ్‌లోని చైర్‌పై నిద్రిస్తున్న శునకం

తెలుగు సాహిత్య సముద్రుడు ఆరుద్ర

మద్దిలపాలెం : ఆరుద్ర శతజయంతి మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగంలో ఆరుద్ర సాహిత్య సమాలోచన సభ శనివారం నిర్వహించారు. విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు పాల్గొని ఆరుద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్య సముద్రుడు ఆరుద్ర అని కొనియాడారు. ఏయూ, వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తెలుగు విశ్వవిద్యాలయం కళా ప్రపూర్ణతో, డిలీట్ పట్టా ఇచ్చి సన్మానించాయని గుర్తు చేశారు. జర్రా అప్పారావు మాట్లాడుతూ ఆరుద్ర గొప్పతనాన్ని వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ, స్నేహలత, ఉదయలక్ష్మి, వంశీ, చందు, నితిన్ పాల్గొన్నారు.



ఆరుద్ర చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్యులు

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



విద్యార్థినుల నృత్య ప్రదర్శన



అతిథులతో అధ్యాపకులు, విద్యార్థినులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో 68వ స్టూడెంట్ కౌన్సిల్ ప్రారంభోత్సవ వేడుకలు శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ మేరకు కొత్త విద్యా సంవత్సరంలో చేరిన ఇంటర్, డిగ్రీ ఫస్టియర్ విద్యార్థులను స్వాగతిస్తూ ఫ్రెషర్స్ డే వేడుకలు జరిపారు. ముఖ్య అతిథిగా గీతం డీమ్డ్ టు బి యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్, ఫిజిక్స్, ప్రొఫెసర్ డాక్టర్ పి.సరిత పాల్గొని వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో స్వయం నిర్ణయాత్మక శక్తి పెరిగినప్పుడే సాధికారత పొందినట్లని పేర్కొన్నారు. సైబర్ క్రైమ్, గృహ హింస చట్టం గురించి అవగాహన కల్పించారు. విలువల ఆధారిత విద్య, ఆత్మ విశ్వాసం, ఆత్మగౌరవం అవసరాన్ని వివరించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. మిస్ ఫ్రెషర్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. డిగ్రీ విభాగంలో అమృత ఖ్యాతి, ప్రగ్య రాణి, ఇంటర్ విభాగంలో జమీలా ఖతూన్, అనుష్క విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ షైజీ, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ సుజాత, సోనీ, మౌసమి, సిస్టర్ దిపాలి, ప్రత్యూష, డాక్టర్ కోటేశ్వర్, డాక్టర్ ప్రవీణ్, ఊర్మిల, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, కౌన్సిల్ సలహాదారులు తదితరులు పాల్గొన్నారు.



మిస్ ఫ్రెషర్ అవార్డు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ

వృత్తి నైపుణ్యం పెంపుదలపై వర్క్‌షాప్



కార్యక్రమంలో పాల్గొన్న షిప్‌యార్డ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ సంస్థలో పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల సామర్థ్యం, వృత్తిపరమైన నైపుణ్యం పెంపొందించడమే లక్ష్యంగా మహారాష్ట్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సహకారంతో శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమాన్ని సీఎండీ సింగ్, సీఎండీ రాకేష్ ప్రసాద్ ప్రారంభించారు. ఉద్యోగులు పనిచేస్తున్న విభాగాల్లో ఏ విధంగా నాయకత్వ లక్షణాలను వృద్ధి చేసుకోవాలి, వ్యూహాత్మక ఆలోచనతో ఏ విధంగా ముందుగా వెళ్లాలి, ఉత్తమ పద్ధతుల అన్వేషణ వంటి అంశాలను వివరించారు.

సమ్మిళిత విద్యను చేరువ చేయాలి

మద్దిలపాలెం : సమ్మిళిత విద్య చేరువ చేసేందుకు కృషి చేయాలని రీహేబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యురాలు, అలగప్ప యూనివర్సిటీ స్పెషల్ ఎడ్యుకేషన్ రిపోలిటిషన్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య సుజాత మాలిని సూచించారు. ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ తరగతులను ఉద్దేశించి శనివారం ఆమె వర్చువల్‌గా ప్రసంగించారు. స్పెషల్ ఎడ్యుకేషన్ జోన్‌లు ఏర్పాటు కావాలని, కరికులంలో సరళత ఉండాలని ఆమె సూచించారు. నూతన విద్యా విధానం అందించిన సూచనలను క్షేత్ర స్థాయిలో అమలు చేయాలన్నారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య జి.పి. రాజశేఖర్ మాట్లాడుతూ దివ్యాంగులైన విద్యార్థులను గుర్తించి వారికి అనువైన బోధన, అభ్యసన విధానాలు అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా తన అనుభవాలను పంచుకుంటూ, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు బోధించిన విధానాన్ని వివరించారు. ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ జాతీయ విద్య విధానం అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ రీహేబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో మూడు రోజులపాటు కంటిన్యూయింగ్ రీహేబిలిటేషన్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఆచార్య డి.నగరాజ కుమారి, డాక్టర్ ప్రకాష్ల రచించిన స్పెషల్ ఎడ్యుకేషన్ అండ్ మల్టిపుల్ డిజెబిలిటీస్ పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. అనంతరం రిసోర్స్‌పర్సన్స్‌ను సత్కరించారు.

గోపాలపట్నం పశువుల ఆస్పత్రిలో తనిఖీలు

గోపాలపట్నం: గోపాలపట్నం పశువుల ఆస్పత్రిని శనివారం పశుసంవర్ధక శాఖ సంచాలకుడు డాక్టర్ దామోదరనాయుడు ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రిలో సౌకర్యాలను వైద్యం అందించే విధానాన్ని ఆయన పరిశీలించారు. ఆస్పత్రి పరిసరాలను చూసి నిర్వహణ తీరును అభినందించారు. రికార్డులను పరిశీలించారు. పలువురు జంతువుల యజమానులు, పశువుల పెంపకం దార్లతో మాట్లాడారు. వైద్యుడు రవికుమార్ శిక్షణలో ఉన్నారని సిబ్బంది తెలిపారు. ఆయనతో పాటు సంయుక్త సంచాలకుడు డాక్టర్ కరుణాకరరావు, ఉప సంచాలకుడు డాక్టర్ ఎం. చంద్రశేఖర్ పాల్గొన్నారు.



గోపాలపట్నం పశువుల ఆస్పత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న డాక్టర్ దామోదర నాయుడు